క్లుప్తంగా

అమ్మవారికి సారె సమర్పణ



మధురానగర్(విజయవాడసెంట్రల్):ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ముత్యాలంపాడు కోదండ రామాలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో 18 రకాల పిండి వంటలతో సారె సమర్పించారు. ఆలయ అర్చకులు గోదా రంగనాథ స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు, మహిళలు భక్తిశ్రద్ధలతో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం శ్రీ గోదారంగనాథస్వామి వారిని ముత్యాలంపాడు పురవీధులలో మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో విద్యార్థులకు క్రాఫ్ట్ పోటీలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో విద్యార్థులకు క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన పోటీల్లో నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు క్లే, కాటన్, అట్టలతో వివిధ రకాల మెటీరియల్ ఉపయోగించి ఆకర్షణీయమైన బొమ్మలు తయారు చేశారు. ఈ పోటీలలో లిఖిత్ , హారిక, రాజేశ్వరి వరుసగా మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు. చంద్రిక ప్రత్యేక బహుమతి గెలుచుకొంది. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కె.రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు పండుగల ప్రాముఖ్యత తెలియజేడంతోపాటు వారిలోని సృజనాత్మకశక్తిని వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించామన్నారు. అధ్యాపకురాలు దుర్గా భవాని, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద చిన్నారులకు దుస్తులు పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): క్రిస్మస్‌ను పురస్క రించుకుని నిరుపేద చిన్నారులకు ఆదివారం దక్ష ఫౌండేషన్ ఆధ్వర్యాన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్‌కు ప్రతి ఒక్కరూ నూతన దుస్తులు ధరించటానికి గానూ దుస్తులు పంపిణీ చేయటం అభినందనీయం అన్నారు. ప్రతి ఒక్కరూ కలిసి మెలసి క్రిస్మస్ వేడుకలను జరుపుకోవాలని సూచించారు. దక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేష్ గోదావరి మాట్లాడుతూ క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఇంట్లో వాడని మంచి దుస్తులను సేకరించటంతో పాటు మరికొన్ని నూతన వస్త్రాలు కొనుగోలు చేసి నిరుపేదలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బీఆర్‌టీఎస్ రోడ్డు, ఏలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో నిరుపేదలకు దుస్తులు అందజేశారు.

నైతిక విలువలకు కట్టుబడిన జర్నలిస్టు మానికొండ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్):జర్నలిజంలో నైతిక విలువలకు కట్టుబడిన వ్యక్తి మానికొండ చలపతిరావు అని సీనియర్ జర్నలిస్టు ఆకుల అమరయ్య కొనియాడారు. మిర్యాల వెంకట్రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ యూసుఫ్ గూడలోని ఫంక్షన్ హాల్లో భారతీయ జర్నలిజం ధ్రువతార మానికొండ చలపతిరావు (ఎంసీరావు) పుస్తకావిష్కరణ సభ జరిగింది. మేఘాలయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కొట్టు శేఖర్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక రచయిత, సీనియర్ జర్నలిస్ట్ ఆకుల అమరయ్యను సత్కరించారు. ఈ సందర్భంగా అమరయ్య మాట్లాడుతూ మానికొండ చలపతిరావు పద్మభూషణ్ అవార్డును సైతం తిరస్కరించారని గుర్తుచేశారు. జర్నలిస్టులకు చలపతిరావు జీవిత చరిత్ర, జర్నలిజం విలువల గురించి ప్రముఖులు అనేకమంది రాసిన దాదాపు 30 వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్ సామాజిక న్యాయ విశ్లేషకులు కటారి అప్పారావు, అరవ రామకృష్ణ, మాజీ ఐఏఎస్ ఆఫీసర్ తోట గోపాలకృష్ణ, సమ్మెట నాగమల్లేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు చందు జనార్దన్, పాశం యాదగిరి రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



రామకృష్ణాపురంలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు



దేవీనగర్ రోడ్డులో స్తంభాల దుస్థితి

- వరదల ప్రభావానికి ఒరిగిపోయిన వైనం
- నేటికీ సరిచేయని విద్యుత్‌శాఖ
- పట్టించుకోని అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):వరదల ప్రభావంతో రోజుల తరబడి నీటిలో నానిపోయిన విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏ స్తంభం కూలిపోతుందో కూడా అర్థంగాని పరిస్థితి నెలకొంది. అనేక ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. 30వ డివిజన్ రామకృష్ణాపురం గుణదల రోడ్డు, దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇటీవల బుడమేరు వరదల సమయంలో బుడమేరు ఉధ్ధృతికి మట్టి కొట్టుకుపోయి విద్యుత్ స్తంభాలు ఒకపక్కకు వంగిపోయాయి. ఎప్పుడు కూలిపోతాయో తెలియని విధంగా తయారయ్యాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనంటూ వాహన చోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారినప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక వేళ జరగరానిది జరిగితే ప్రమాద తీవ్రత అధికంగా ఉండే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుడమేరు వరద సమయంలో ఒరగిపోయిన విద్యుత్ స్తంభాలు నెలలు గడిచినా పట్టించుకోకపోవటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తరువాత చర్యలు తీసుకునే కన్నా ముందుగానే చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.



దావు బుచ్చయ్యకాలనీ గుణదల రోడ్డులో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలు

భయంగా ఉంది



ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలి. స్తంభాలు ఒరిగిపోవటంతో ఎప్పుడు కూలిపోతాయోనని ఆందోళనగా ఉంది. వరదలు, వర్షాల సమయంలో ఈ రోడ్డులో వెళ్లాలంటేనే భయంగా ఉంది.

–ఎస్‌కే నాగూర్ వలీ, జీవీఆర్‌నగర్

రాత్రిళ్లు ఇబ్బందికరంగా మారింది



ప్రమాదకరంగా ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను నెలలు గడుస్తున్నా కనీస మరమ్మతులు చేయటం లేదు. రోజులు గడిచే కొద్దీ విద్యుత్ స్తంభాలు మరింతగా ఒరిగిపోవటం ఆందోళన కలిగిస్తున్నాయి. ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాల వల్ల వీధి దీపాల వెలుతురు కూడా రోడ్లుపైకి రావటం లేదు. దీంతో రాత్రి పూట ఇబ్బందికరంగా ఉంది.

–జి.వెంకటేశ్వరరావు, దేవీనగర్

కృష్ణా వర్సిటీ యోగా జట్లు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: భువనేశ్వర్‌లోని కేఐఐటీ యూనివర్సిటీలో ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జాతీయ అంతర విశ్వ విద్యాలయాల యోగా పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్లును ఎంపిక చేసినట్లు పీబీ సిద్ధార్థ కాలేజీ ప్రిన్సిపాల్, ఎంపిక కమిటీ చైర్మన్ మేకా రమేష్ తెలిపారు. పురుషుల జట్టుకు షాలేమురాజు, హరిశంకర్, వరుణ్, రాకేష్, శ్రీదుర్గాగౌరినాథ్, మనిసుభాష్, మహిళల జట్టుకు జ్యోష్ణదేవి, మౌనిక, శృతి, జెబాతెహరీన్, సమీరా, చంద్రిక ఎంపికైనట్లు ప్రకటించారు. ఈ జట్లకు మేనేజర్‌గా డాక్టర్ టి.వి.బి.కృష్ణారెడ్డి వ్యవహరిస్తున్నారని వివరించారు. తమ కాలేజీలో ఈ జట్లకు కిట్లను ఆదివారం అందజేశామని తెలిపారు.

సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని 'సర్వేజనాః సుఖినో భవంతు' సంస్థ ఆధ్వర్యాన ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు , ఇంజినీర్లు, కళాకారులు తదితరుల సేవలను గుర్తించి 'సంక్రాంతి విశిష్ట ప్రతిభా పురస్కారం -2025'తో సత్కరించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఈఎస్ఎస్ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు వారు చేస్తున్న సేవలు వివరాలను 'సర్వేజనాః సుఖినో భవంతు' డోర్ నెం. 1-20-164, పోస్టు, తిరుమలగిరి, గోకుల్‌నగర్, వెంకటాపురం సికింద్రాబాద్-15 చిరునామాకు ఈ నెల 31వ తేదీలోగా పంపించాల్సిందిగా కోరారు. ఎంపిక చేసిన వారికి జనవరి 12న హైదరాబాద్‌లో ప్రముఖుల చేతులమీదుగా సత్కరించనున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 9652347207 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

శత వార్షికోత్సవ సభ జయప్రదం చేయండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)99 వసంతాలు పూర్తి చేసుకొని 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో డిసెంబరు 26వ తేదీన నిర్వహించే శత వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక దాసరి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి లెనిన్ సెంటర్ వరకు రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం 4 గంటలకు లెనిన్ సెంటర్‌లో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ , జాతీయ సమితి సభ్యులు అక్కినేని వనజ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని పాల్గొంటారని తెలిపారు. దేశ వ్యాప్తంగా శత వార్షికోత్సవాలకు పార్టీ శ్రీకారం చుట్టిందన్నారు. దేశంలో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి వివిధ ప్రాంతాల్లో అణగారిని వర్గాలకు అండగా ఉంటూ భూమి కోసం ... భుక్తి కోసం.. పేద ప్రజల కోసం విముక్తి కోసం ...అనేక ఉద్యమాలు చేసి లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. ప్రత్యేకంగా తెలుగు గడ్డపై తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిందన్నారు. సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు బుట్టి రాయప్ప, తాడి పైడియ్య, మూలి సాంబశివరావు, కేవీ భాస్కరరావు, పంచదార్ల దుర్గాంబ, అప్పురబోతు రాము, కొట్టు రామణరావు పాల్గొన్నారు.

సీపీఎం బలోపేతానికి ఉద్యమాలు ఉద్ధృతం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):కష్టజీవులు, పేద ప్రజల గొంతుకైన సీపీఎం బలోపేతానికి ఉద్యమాలను ఉధృతం చేయాలని.. అందుకు పార్టీ శ్రేణులు క్షేత్ర స్థాయిలో కృషి మరింత పెరగాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు పిలుపునిచ్చారు. సీపీఎం విజయవాడ సెంట్రల్ సిటీ 23వ మహాసభ ఆర్.కోటేశ్వరరావు, ఎం.డేవిడ్ నగర్ (సింగ్‌నగర్ రాయల్ బాంక్యూట్‌హాల్)లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్, మతోన్మాద విధానాలు, భారాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం చేసే ఆందోళన, పోరాటాలకు ప్రజలు మద్దతుతో పాటు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ మాట్లాడుతూ తనకు మతం, కులం లేదని ఎన్నికల ముందు సన్నాయి పలుకులు పలికిన డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎన్నికల్లో లబ్ధి పొందిన తరువాత పంజరంలో చిలుకలా బీజేపీకి చిక్కిపోయి, కుల వ్యవస్థీకరణ చేయడం, మహిళలకు విలువనివ్వని సనాతన ధర్మాన్ని బుజాన వేసుకొని విస్తృత స్థాయిలో ప్రచారం చేయడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి, భూపతి రమణారావు, కె.దుర్గారావు, ఎం.సీతారాములు, కె.సరోజ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం మోపిన విద్యుత్ భారాలను నిరశిస్తూ సీపీఎం నాయకులు విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని, విద్యుత్ భారాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని నేతలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

మరో ఫ్లై ఓవర్ కోసం ఉద్యమం చేస్తాం

సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):వామపక్ష పార్టీలు అధికారంలో ఉన్నప్పుడే విజయవాడ ప్రధాన నగరంతో పాటు శివారు ప్రాంతాలు కూడా అభివృద్ధి జరిగాయని.. సింగ్‌నగర్‌లో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం కోసం మరో ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం ఉద్యమించేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. ఇటీవల బుడమేరు వరదలతో ధ్వంసం అయిన సీపీఐ 62వ డివిజన్ కార్యాలయం ఉన్న చలసాని భవన్‌ను ఆదివారం ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌నగర్‌లో డివిజన్ కార్యదర్శి లింగా బత్తిన శివకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో కోటేశ్వరరావు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో మేయర్ టి.వెంకటేశ్వరరావు సారథ్యంలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలపై భారాలు వేయకుండా పాలన సాగించినట్లు గుర్తుచేశారు. నేటి పాలకులు చెత్తపై పన్ను విధిస్తే దానికి వ్యతిరేకంగా పోరాటం చేసి విజయం సాధించినట్లు చెప్పారు. సీపీఐ సీనియర్ నేత కె.సుబ్బరాజు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సింగ్‌నగర్ ఫ్లైఓవర్ నిర్మాణం జరిగిందన్నారు. నేటి అవసరాలకు ఏమాత్రం సరిపోని కారణంగా మరో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగేందుకు సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అరుణపతాకాన్ని జి.కోటేశ్వరరావు ఆవిష్కరించగా ఏఐటీయూసీ జెండాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు ఎగురవేశారు. చలసాని వెంకట రత్నం విగ్రహానికి నక్కా వీరభద్రరావు పూల మాల వేసి నివాళులర్పించారు.



చలసాని వెంకటరత్నం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ముస్లిం మైనార్టీల సేవల్లో భాగస్వాములు కావాలి

పాయకాపురం(విజయవాడరూరల్):పేద ముస్లిం మైనార్టీలకు ఆజాద్ ముస్లిం కమిటీ అందచేస్తున్న సేవల్లో భాగస్వాములు కావాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా తెలిపారు. ఆదివారం కండ్రికలో తెనాలి నియోజకవర్గానికి చెందిన ముస్లింలతో ఆజాద్ ముస్లిం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. ముస్లింలు రాజకీయంగా ఎదగటానికి అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటిల్లో ముస్లింలను చైర్మన్లుగా, డైరెక్టర్లుగా నియమించారని పేర్కొన్నారు. నలుగురు ముస్లింలకు ఎమ్మెల్సీలను ఇచ్చిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్ అన్నారు. పేద ముస్లిం మైనార్టీలకు ఆజాద్ కమిటీ చేస్తున్న సేవలను వివరించారు. ఆ సేవా కార్యక్రమాల్లో తెనాలి నియోజకవర్గంలోని ముస్లింలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం తెనాలి నియోజకవర్గం ఇన్‌చార్జి పఠాన్ ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో షేక్ రహీమ్ కమిటీలో చేరారు. గుంటూరు జిల్లా ఆజాద్ ముస్లిం కమిటీ ప్రధాన కార్యదర్శిగా రహీమ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా నియామక పత్రం అందచేశారు. జమాత్ అమీర్ షేక్ రఫీ, విజయవాడ నగర అధ్యక్షుడు సిలార్ బేగ్, మాడుగుల నియోజకవర్గ యిన్‌చార్జి నాగూర్ బాషా, 61వ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండీ రఫీ, స్థానిక నాయకులు అలీ పాల్గొన్నారు.



షేక్ రహీమ్‌కి నియామక పత్రం అందచేస్తున్న షేక్ నాగుల్‌మీరా

క్రీస్తు మార్గంలో పయనించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని క్రీస్తు ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం ఏపీ వైఎస్సార్ సీపీ మాదిగల సంక్షేమ కమిటీ ఆధ్వర్యాన సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో వెలంపల్లి, మల్లాది విష్ణు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఏపీ వైఎస్సార్ సీపీ మాదిగల సంక్షేమ కమిటీ ఏర్పాటు చేసుకుని సెమీ క్రిస్మస్ వేడుకలు ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. సంఘటితంగా ఉండి హక్కులను పరిరక్షించుకోవాలని కోరారు. తాము ఏపీ వైఎస్సార్ సీపీ మాదిగల సంక్షేమ కమిటీకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏసు క్రీస్తు ఆశీస్సులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. శాంతి, సహనం, సేవాగుణం అలవర్చుకోవాలని కోరారు. మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కనకారావు, లిడ్‌క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవి, కార్పొరేటర్ అంబేడ్కర్, మాజీ కార్పొరేటర్ లోకేష్, లీగల్‌సెల్ జోనల్ చైర్మన్ ఒగ్గు గవాస్కర్, ఎసంపత్, సురేష్, రమేష్‌తో కలిసి క్రిస్మస్ కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ మాదిగల సంక్షేమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు తదితరులు

1న దాశరథి మణిదీప మాలిక

విజయవాడ కల్చరల్: సుమధుర కళానికేతన్, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి, నాదవినోదం (అమెరికా) ఆధ్వర్యంలో జనవరి 1 వ తేదీన మొగల్రాజపురంలోని సిద్ధార్థ అకాడమీలో సినీ కవి, పండితుడు దాశరథి కృష్ణమాచారి శత జయంతి సందర్భంగా సినీ సంగీత విభావరి, శత జయంతి వేడుకలు నిర్వహిస్తునట్లు భాస్కర శర్మ, గోళ్ళ నారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గాయని మణి శాస్త్రి, బాల కోటేశ్వరరావు, వంశీధర్, గంగాధర్ పాల్గొంటారని తెలిపారు.

మూర్తీభవించిన ధర్మానికి ప్రతిరూపం శ్రీరామచంద్రుడు






కల్యాణ క్రతువులో పాల్గొన్న భక్తులు

విజయవాడ కల్చరల్: మూర్తీభవించిన ధర్మానికి ప్రతిరూపం శ్రీ రామచంద్రుడని దేవాలయ కన్వీనర్ వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. పూర్ణానందంపేటలోని శ్రీరామచంద్ర స్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణం, పారాయణమండలి సభ్యులు విష్ణు సహస్రనామ పారాయణంలో పాల్గొన్నారు. అర్చక స్వాములు స్వామి వారి ఉత్సవమూర్తులకు తులసి అర్చన, ఆంజనేయ స్వామికి ఆకుపూజ నిర్వహించారు. వేదోక్తంగా దేవాలయంలో పూజలు చేశారు. స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ శ్రీ రాముడు కోట్లాదిమంది భారతీయులకు పూజ్యనీయుడని చెప్పారు. సీతామాతను తమ కులదైవంగా భావిస్తారని తెలిపారు. రామాయణం ద్వారా మన జీవన విధానం మార్చు కోవచ్చునన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 30 మంది దంపతులు కల్యాణ క్రతువులో పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్టు టెస్టు పోటీలు



పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం శాంతినగర్లోని క్యోయోకు కరాటే అకాడమీలో ఆదివారం కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ టెస్ట్ జరిగింది. కరాటే శిక్షకులు బల్లం కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఎల్లో బెల్ట్ ఆరంజ్ బెల్ట్ గ్రీన్ బెల్ట్ బ్లూ బెల్ట్ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు అప్ గ్రేడ్ బెల్ట్‌లు ప్రదానం చేశారు. కోఫోకస్ కరాటే ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎగ్జామినర్ శిహన్ టి.వాసు ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్ట్‌లను ప్రదానం చేశారు. వివేకానంద ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్స్ జి.హరిత మాధవీలత, శ్రీరామ్, బి. సురేష్ అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.కన్నా, బి.ఆర్య పలువురు పాల్గొన్నారు.







ఆకట్టుకున్న క్రిస్మస్ కార్నివాల్

క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విజయవాడ గోపాలరెడ్డి రోడ్డులోని సెయింట్ పాల్స్ బసలిక చర్చిలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సండే స్కూల్ చిన్నారులు నిర్వహించిన క్రిస్మస్ కార్నివాల్, బైబిల్ థీమ్ పార్క్ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ